# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

ఆదివారం 20-8-2023



## ప్రేమ పేరుతో మోసం

## జబర్దస్త్ ఆర్టిస్టుపై కేసు..

హైదరాబాద్,ఆగస్ట్20(తెలుగుప్రభ):



జబర్దస్త్ కమెడియన్, సింగర్ నవ సందీప్‌పై పోలీస్ కేసు నమోదైంది. తనను ప్రేమించానని చెప్పి శారీరకంగా వాడుకొని సందీప్ మోసం చేశాడంటూ ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవ సందీప్‌కు 2018లో వాట్సాప్ చాటింగ్ ద్వారా ఓ 28 ఏళ్ల యవతి పరిచయమైంది. ఆ పరిచయం కాస్తా ఇద్దరి మధ్య ప్రేమగా మారింది. ఆ తర్వాత ఇద్దరూ చాలా కాలం పాటు చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. అయితే ఈ విషయం అమ్మాయి ఇంట్లో తెలియడంతో ఆమెను సందీప్ హైదరాబాద్ రప్పించాడు. షేక్‌పేట్‌లోని అల్ హమారా కాలనీలోని ఓ హాస్టల్లో ఉంచాడు. నాలుగు సంవత్సరాలుగా ఆ అమ్మాయి ఆ హాస్టల్‌లోనే ఉంటోంది. ఈ క్రమంలోనే ఇద్దరు శారీరంకంగా కూడా దగ్గరయ్యారు. అయితే తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన సందీప్.. ఆ తర్వాత మొహం చాటేశాడు. పెళ్లి మాటెత్తేసరికి సందీప్ మాట మారుస్తున్నాడు. యువతి అంటే ఇష్టం లేదని.. వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని తెగేసి చెప్పాడు. బాధితురాలు గోల్కొండ పోలీసులను ఆశ్రయించింది. తనను శారీరకంగా వాడుకొని మోసం చేశాడని ఫిర్యాదు చేసిది. ఆమె ఫిర్యాదు మేరకు గోల్కొండ పోలీసులు జీరో ఎఫ్ఎస్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కేసును మధురానగర్ పోలీసుస్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. మధురానగర్ పోలీసులు ఈ కేసును విచారణ చేస్తున్నారు.



## జాబిల్లి గుట్టు విప్పనున్న రోవర్

బెంగళూరు, ఆగస్టు 19(తెలుగుప్రభ):

చంద్రయాన్–3 చంద్రుడి దిశగా పరుగులు పెడుతున్నది. అన్నీ సజావుగా సాగి చంద్రుడి ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ కాలు మోపితే,ఇప్పటివరకు ప్రపంచానికి తెలియని అనేక రహస్యాలను ఇది బయటపెట్టనున్నది. ఈ పరిశోధనల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్నది ప్రజ్ఞాన్ రోవర్.స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఇది ఆరు చక్రాలతో జాబిల్లిపై పరుగులు పెట్టనుంది.దీని బరువు 26 కిలోలే. చంద్రుడి ఉపరితలంపై సేకరించే సమాచారాన్ని ఇది ల్యాండర్ విక్రమ్ సాయంతో భూమికి చేరవేస్తుంది. తనతో పాటు అనేక పరికరాలు, సెన్సార్లను ఇది తీసుకెళ్తున్నది. ఆల్ఫా పార్టికల్ ఎక్స్–రే స్పెక్ట్రోమీటర్ (ఏపీఎక్స్ఎస్), లేజర్ ప్రేరిత బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ (ఎల్ఐబీఎస్) సహా ప్రయోగాలు జరిపే పరికరాలు ఇందులో ఉంటాయి. ఖనిజాలు, పగలు– రాత్రి చక్రం, అణువులు, మట్టి, నీటి జాడ, సన్నని ఉపరితల వాతావరణం తదితర అంశాలపై రోవర్ దృష్టి సారిస్తుంది.



# కౌంట్‌డౌన్..

## రేపే బీఆర్ఎస్ తొలి జాబితా!.. గెలుపు గుర్రాలకే టికెట్లు

హైదరాబాద్, ఆగస్ట్20(తెలుగుప్రభ):

ఎందరెందరో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బీఆర్ఎస్ టిక్కెట్ల పంపిణీ కి ముహూర్తం ఖరారైంది. రేపు శ్రావణ పంచమి రోజైన సోమవారం పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖరరావు వీటిని పంపిణీ చేయనున్నారు. బీఆర్ఎస్‌లో టిక్కెట్లకు ఇదివరలో ఎన్నడూ లేనంతగా తీవ్ర పోటీ ఏర్పడింది. ఉన్న సీట్లకు మించి అభ్యర్థులు, సమర్థులు రెండు మూడు రెట్లు ఎక్కువగా ఉండటంతో అధిష్ఠానం ఆచితూచి వ్యవహరించింది. పార్టీ గెలుపు,కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా రికార్డుకెక్కడం తథ్యమనే ధీమాతో టిక్కెట్లకు భారీ డిమాండ్ పెరిగింది.తమకు టిక్కెట్లు రావని నిర్ణయించుకున్నాకే జూపల్లి కృష్ణారావు, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి వంటి వారు కాంగ్రెస్‌లోకి వెళ్లార ని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

### పెండింగ్ లిస్ట్

తొలి జాబితాలో పేర్లుండని నియోజకవర్గాల్లో జనగామ, స్టేషన్ ఘనపూర్, వరంగల్ ఈస్ట్, ఆసిఫాబాద్, ఖానాపూర్, ఉప్పల్, అంబర్‌పేట, పెద్దపల్లి, రామగుండం,కొత్తగూడెం, నాగార్జునసాగర్,కంటోన్మెంట్ తదితరమైనవి ఉండనున్నట్లు తెలుస్తోంది.

### మరో అవకాశం

ప్రస్తుతం టిక్కెట్లు దక్కని వారు పార్టీ నుంచి వెళ్లిపోకుండా పార్టీ ముఖ్యులు తగిన చర్యలు చేపట్టారు. అందరూ ఇంటి సభ్యులే అయినందున ప్రస్తుతానికి ఎమ్మెల్యే అవకాశం దక్కకపోయినా.. తగిన విధంగా గుర్తింపు, ఎమ్మెల్సీలుగా, కార్పొరేషన్ల ఛైర్మన్లుగా అవకాశం ఇస్తామని నచ్చజెప్పారు. పార్టీలోనే ఉండటం వల్ల విధేయత చాటడంతోపాటు ముమ్ముందు తగిన ప్రాధాన్యత తప్పకుండా ఉంటుందనే తలంపుతో పలువురు మెత్తబడ్డట్లు తెలుస్తోంది. వేరే పార్టీలోకి పోయినా వచ్చేదేమీ ఉండదనే అభిప్రాయం అందుకు మరో కారణం. ఎవరినీ వదులుకోవడం ఇష్టం లేకనే టిక్కెట్లు ఇవ్వలేని వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. టిక్కెట్ల ప్రకటనకు ముందే తమను సంప్రదించడమంటే తమకు తగిన గౌరవమిస్తున్నట్లే నని ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే తన అనుచరుల వద్ద పేర్కొన్నట్లు తెలిసింది.

### సాగర్ బరిలో...

నాగార్జునసాగర్ నియోజకవర్గం టిక్కెట్ ఈసారి నోముల భగత్‌కు గగనమేననే సంకేతాలున్నాయి. ఒకవేళ సిట్టింగ్ భగత్‌ను తప్పించాల్సి వస్తే .. హీరో అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖరరెడ్డికి అవకాశాలుండవచ్చుననే అంచనాలున్నాయి. తాజాగా నియోజకవర్గంలో చంద్రశేఖరరెడ్డి నిర్మించిన కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవానికి అల్లు అర్జున్ హాజరుకావడం ఈ అంచనాలకు బలం చేకూర్చుతోంది. ఆయనకు టిక్కెట్ లభిస్తే 'రేసుగుర్రం' ప్రచారంలో ప్రముఖంగా పాల్గొననుంది. అల్లుని స్టార్‌డమ్ మామకు బలాన్నిస్తుందనే అభిప్రాయాలు బలంగానే ఉన్నాయి. ఏం జరగనుందన్నది త్వరలోనే వెల్లడి కానుంది.




### 105 లేదా 96 స్థానాలకు

టిక్కెట్ అంటూ వస్తే బీఆర్ఎస్ జెండా చాలు గెలవడానికన్నది నాయకులకు అర్థమైపోయింది. అందువల్లే పలు ప్రాంతాల్లో గొడవలు, సిట్టింగ్‌లకు వద్దనే డిమాండ్లు పెరిగిపోయాయి. అందరినీ సర్దడం కష్టం కావడంతో అధిష్ఠానం వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేసినట్లు తెలిసింది. తుది పరిశీలన కోసం కొన్ని నియోజకవర్గాల టిక్కెట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. కేసీఆర్ లక్కీనెంబర్ 6 అయినందున తొలి జాబితాలో 105 లేదా 96 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# 'డబుల్' ఇళ్ల పంపిణీ అప్పుడే..

## వడివడిగా ఏర్పాట్లు.. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్,ఆగస్ట్20(తెలుగుప్రభ):

నగరంలో తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కి సెప్టెంబర్ 2 వ తేదీ నుండి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర పశుసంవర్థక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌స్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కలెక్టర్ లు అనుదీప్ దురిశెట్టి, హరీష్, అమయ్ కుమార్, హౌసింగ్ సీఈ సురేష్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 2 వ తేదీన జీహెచ్ఎంసీ పరిధిలోని 8 ప్రాంతాలలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ జరుగుతుందని, అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో పారదర్శకత ఉండేందుకు గాను ఈ నెల 24 వ తేదీన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ర్యాండమైజేషన్ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించి డ్రా పద్దతిలో అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. మొదటి విడతగా 12 వేలమంది లబ్దిదారులకు ఇళ్లను కేటాయించనున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు పెద్ద మనసుతో పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చి తన ఉదారత్వాన్ని చాటుకున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రోడ్లు, డ్రైనేజీ, వాటర్, విద్యుత్ వంటి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వం నిర్మించి పేదలకు ఉచితంగా అందజేస్తుందని చెప్పారు.



## యూఎస్‌కు హిమాన్షు

### – వెంట కుటుంబంతో కేటీఆర్

హైదరాబాద్,ఆగస్ట్20(తెలుగుప్రభ):

మునిసిపల్ మంత్రి కె.తారకరామారావు కొడుకు, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మనుమడు హిమాన్షు ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా బయల్దేరాడు. కొడుకును అక్కడ దింపి రావడానికి కేటీఆర్ కుటుంబంతో వెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్ ట్విట్టర్ ద్వారా తన స్పందన తెలియజేశారు. నిన్న మొన్నటిదాకా అల్లరిగా తిరిగిన చిన్నపిల్లాడు పెరిగి కాలేజ్‌కు వెళ్తున్నాడంటే నమ్మలేక పోతున్నాను. తనతో పాటు నన్నూ వెంట తీసుకువెళ్తున్నాడు. తండ్రిగా కుటుంబంతో వెళ్తున్నాను. కొద్దిరోజుల పని చూసుకోవడంతో పాటు వారం రోజులు అక్కడ గడపనున్నట్లు పేర్కొన్నారు. హిమాన్షు చిన్నప్పటి ఫొటోనూ షేర్ చేశారు.

## హైదరాబాద్‌లో 'బయో ఏషియా–2024'

హైదరాబాద్,ఆగస్ట్20(తెలుగుప్రభ):



బయో ఏషియా 21వ సదస్సు 2024ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో జరగనున్నది. ఈవై భాగస్వామ్యంతో నిర్వహించనున్న ఈ సదస్సు షెడ్యూల్‌ను మంత్రి కేటీఆర్ వెలువరించారు. 'డాటా అండ్ ఏఐ: రీడిఫైనింగ్ పాజిబిలిటీస్' అనే థీమ్‌తో నిర్వహించనున్న ఈ సదస్సులో 50కిపైగా దేశాలకు చెందిన వివిధ రంగాల నిపుణులు, విధాన నిర్ణేతలు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలు, భాగస్వామ్యాలకు వేదికగా నిలిచే బయో ఏషియా సదస్సు.. నూతన శకానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. టెక్నాలజీ, బయాలజీ, డాటా సైన్స్, లైఫ్‌సైన్సెస్ రంగాలకు హైదరాబాద్ ప్రధాన కూడలిగా భాసిల్లుతున్నదని, జీవశాస్త్రాల రంగం పురోభివద్ధికి ఇక్కడి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, లైఫ్ సైన్సెస్, బయో ఏషియా సీఈవో శక్తి నాగప్పన్, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనం లోయలో పడి 9 మంది జవాన్ల మృతి

లడఖ్, ఆగస్ట్20(తెలుగుప్రభ):

లడఖ్‌లోని ఖేరి సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. భారత జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదవశాత్తు లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది సైనికులు వీర మరణం పొందారని అధికారులు తెలిపారు. వీరిలో ఒకరు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో), ఎనిమిది మంది జవాన్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. లేహ్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలోని ఖేరీ ప్రాంతం వద్ద ఈ ప్రమాదం జరిగింది.ప్రమాదం జరిగిన సమయంలో సైనిక వాహనంలో 10 మంది ప్రయాణిస్తున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం 4.45 గంటల సమయంలో లేహ్ నుంచి నైమా వైపు వెళ్తుండగా వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ఘటన జరిగిందని లేహ్ సీనియర్ ఎస్పీ పి.డి. నిత్యా వెల్లడించారు. సమాచారం తెలియగానే పోలీసు బృందం ఘటనా స్థలానికి వెళ్లిందన్నారు. గాయపడిన సైనికులను ఆర్మీ ఆస్పత్రికి తరలించినట్టు వివరించారు.

## దళితులు రాకుండా ఆలయానికి తాళం

తిరుపతి,ఆగస్ట్20(తెలుగుప్రభ):

దళితులు ఆలయంలోకి రాకుండా తాళం వేసిన ఘటన ఇది. పుత్తూరు మండలం గొల్లపల్లి గ్రామంలోని పోలాక్షమ్మ జాతర సందర్భంగా శనివారం దళితులు పొంగళ్లు పెట్టేందుకు ఆలయానికి వెళ్లారు. ఆలయ పూజారి, గ్రామస్థుల దళితులకు ప్రవేశం లేదంటూ ఆలయానికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. దీంతో దళితులు అక్కడ నిరసన దిగారు. చివరకు అమ్మవారికి బయటే పొంగళ్లు నివేదించి, మొక్కులు చెల్లించుకుని నిరాశతో వెనుదిరిగారు. ఈ ఘటనపై దళితపోరాట హక్కుల సమితి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడు మాసాలుగా పోరాటం చేస్తున్నామని, తాము గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అయినా ఫలితం లేకపోయిందని మండిపడింది.దళిత హక్కుల సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ, పోలాక్షమ్మ ఆలయంలోకి దళితులకు ప్రవేశం కల్పించాలని మూడు నెలల నుంచి తాము పోరాటం చేస్తున్నామని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్‌ను పంపి ప్రవేశం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు.